సాక్షి ఒడిశా

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,57,057లు, బంగారం 12 గ్రాము 140 మిల్లీగ్రాము, వెండి 476గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నలుగురు అరెస్టు

రామగిరి వారపు సంతలో కొందరు దాదాగిరీ చేస్తున్నారు. వారిలో నలుగురిని అరెస్టు చేశారు.

- IIలో▸



బాణసంచా పేలుడు

జియాకోట గ్రామంలో బాణసంచా పేలుడు సంభవించింది. ఒకరు మృతి చెందారు.

- IIలో▸

న్యూస్‌రీల్

పిడుగుపాటుకు యువకుడి మృతి



ధనర నాయిక్ మృతదేహం వద్ద బంధువులు

జయపురం: పిడుగుపడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ సమితి బొడాసన గ్రామ పంచాయితీ గుణియగుడ గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుణియగుడ గ్రామానికి చెందిన బలరాం నాయిక్ కుమారుడు ధనర నాయిక్ (27) వ్యక్తిగత పనిపై గిర్ల గ్రామానికి వెళ్లి పని ముగించుకొని సాయంత్రం తన గ్రామానికి పొలాల గట్టు దారిలో తిరిగి వస్తుండగా కుండపోత వర్షంతోపాటు పిడుగు అతనిపై పడడంతో అక్కడికక్కడే మరణించారు. సమీపంలో ఉన్న వారు గమనించి ధనర నాయిక్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసున మోదు చేసి నాయిక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు కొట్‌పాడ్ పోలీసు అధికారి పరమానంద సునాని ఆదివారం తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని రైల్వే, అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి 9.200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో భాగంగా రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరి బ్యాగులు తనిఖీ చేయగా అందులో గంజాయి దొరికింది. నిందితులు కేరళ రాష్ట్రానికి చెందిన శ్యామ్ నాయక్, రజనీలుగా గుర్తించారు. అబ్కారీ శాఖ డీఎస్పీ ప్రభాత్ కుమార్ త్రిపాఠి, ఐఐసీ బినయ్ ప్రసాద్ మోంచ్, ఎస్‌ఏకే నాయక్ తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

రేపు బీజేడీ శాసన సభ ఘెరావ్



శంఖ భవన్‌లో బీజేడీ విలేకరుల సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర పంచాయతీ రాజ్ వ్యవస్థలో ప్రజా ప్రతినిధులకు ఉన్న అధికారాలను రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కుదించింది. అందుకు నిరసనగా బిజూ జనతా దళ్ (బీజేడీ) ఈ నెల 23 మంగళవారం రాష్ట్ర శాసన సభ ఘెరావ్ చేస్తామని ప్రకటించింది. బీజేడీ సీనియర్ నాయకులు దేవీ ప్రసాద్ మిశ్రా, డాక్టర్ అరుణ్ కుమార్ సాహు, ప్రమీలా మల్లిక్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాషాయ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలోని మూడు అంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థలో ప్రజా ప్రతినిధుల అధికారాలను తగ్గించడం ఒడిశా పంచాయతీ సమితి చట్టాన్ని ఉల్లంఘించడం అవుతుందని పేర్కొంది. తద్వారా అధికారులకు విస్తృత అధికారాలను కల్పించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడంలో ఘోరంగా విఫలమైందని, రాష్ట్రంలో అభివృద్ధి కార్యకలాపాలు కుంటుపడ్డాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రజా స్వామ్యాన్ని బలహీనపరిచే లక్ష్యంతో ఇమిడి ఉందని, పంచాయతీ రాజ్ వ్యవస్థ పునాదులను డీలాపరిచే బలహీన చర్యగా విపక్షం ఆరోపించింది. బిజూ జనతా దళ్ నాయకులు, కార్యకర్తలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, మండల చైర్‌పర్సన్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఈ నెల 23న స్థానిక దిగువ పీఎంజీ ప్రాంతంలో సమావేశమై రాష్ట్ర శాసన సభను ఘెరావ్ చేస్తారని బీజేడీ ప్రకటించింది. బీజేడీ ఎమ్మెల్యేలు మంగళవారం రాష్ట్ర శాసన సభ లోపల కూడా నిరసన తెలుపుతారని డాక్టర్ అరుణ్ కుమార్ సాహు ప్రకటించారు.

మాదకద్రవ్యాలను.. తరిమికొడదాం



క్రీడా పతాకం ఊపి నమో యువ మారథాన్ ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్:

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా నగరంలో నిర్వహించిన 'నమో యువ మారథాన్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పాల్గొన్నారు. స్థానిక కళింగ స్టేడియం 3వ నంబరు గేటు ప్రాంతం నుంచి పతాకం ఊపి పరుగు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తరిమికొడదామని పిలుపునిచ్చారు. మాదకద్రవ్య రహిత భారత దేశ ఆవిష్కరణ దృక్పథంతో భువనేశ్వర్‌తో సహా దేశంలోని 75 నగరాల్లో ఏక కాలంలో నమో యువ మారథాన్ ఒక శక్తివంతమైన సామాజిక ఉద్యమంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది ఆరోగ్యకరమైన, సుసంపన్న, మాదక ద్రవ్య రహిత భారత దేశం నిర్మాణానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. యువశక్తి దేశ నిర్మాణానికి మూల ఆధారమని, మనమంతా కలిసి ఈ పరుగు కేవలం ప్రచారంగా కాకుండా ఆరోగ్యం, ఐక్యత యొక్క ప్రధాన మంత్రంగా ప్రతిబింబింపజేయాలని ముఖ్యమంత్రి ప్రేరేపించారు. యువ శక్తిని కూడగట్టుకుని సుసంపన్న ఒడిశాతో కూడిన వికసిత భారతదేశాన్ని నిర్మించడం సుసాధ్యమని అన్నారు.



ముఖ్యమంత్రి నమో యువ మారథాన్



నమో యువ మారథాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగం

టీ కొట్టు ముంగిట ముఖ్యమంత్రి బాతాఖానీ



ముఖ్యమంత్రితో ప్రజల ముచ్చట

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ స్థానిక మేఫెయిర్ చౌరస్తాలో టీ కొట్టు ఆవరణలో ప్రత్యక్షమై బాతాఖానీ చేయడం స్థానికుల్ని ఔరా అనిపించింది. టీ కొట్టుకు వచ్చిపోయే వారితో సాదాసీదా వ్యక్తిగా వ్యక్తిగా హోదా, భద్రతా నిబంధనలకు అతీతంగా సంభాషించారు. ఆదివారం నమో యువ పరుగు కార్యక్రమం నుంచి తిరిగి వస్తుండగా దారిలో మేఫెయిర్ స్క్వేర్ ప్రాంతంలో ఆగి స్థానికులతో ముఖాముఖి పలు సాధారణ, దైనందిన వివరాలపై చర్చించారు. ఈ సంభాషణలో పలు ప్రజాహిత అంశాలు కాకతాళీయంగా చోటు చేసుకున్నాయని ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. టీ కొట్టు ముంగిట ముఖ్యమంత్రి ఆగిన కాసేపట్లో చుట్టూ జనసమూహం గుమిగూడి ఆయనతో నేరుగా మాట్లాడే అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. సంభాషణ సమయంలో ముఖ్యమంత్రి ప్రజా సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, పలు సామాజిక విషయాలతో సహా వివిధ స్థానిక దైనందిన సమస్యల గురించి నివాసితులను అడిగి తెలుసుకున్నారు. పలువురి సూచనలను పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఇలాంటి ప్రత్యక్ష సంభాషణ ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంటుందన్నారు.



మేఫెయిర్ స్క్వేర్ చౌరస్తా టీ కొట్టు ముంగిట ముఖ్యమంత్రి బాతాఖానీ

పౌరులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను తరచు పంచుకోవాలని ముఖ్యమంత్రి ప్రోత్సహించారు. ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ పట్ల ముఖ్యమంత్రి తన అనుభూతిని సాంఘిక మాధ్యమ వేదికలపై ప్రసారం చేశారు. ఈ ప్రసారంలో ఆయన 'ఈ రోజు 'నమో యువ మారథాన్' నుంచి తిరిగి వస్తున్నప్పుడు, నేను భువనేశ్వర్‌లోని మేఫెయిర్ స్క్వేర్‌లో సాధారణ ప్రజలతో వివిధ అంశాలపై సంభాషించాను. ప్రజల ప్రేమ, ఆదరణ, అభిమానం మరియు మద్దతు నాకు దృఢ సంకల్పాన్ని ప్రసాదించాయి. నేను మీలో ఒకరిగా భావిస్తాను, అందుకే నేను ఎల్లప్పుడూ మీ అందరితో కనెక్ట్ అయి ఉండటానికి ఇష్టపడతాను' అని పేర్కొన్నారు.

దారి దోపిడీ దొంగలు అరెస్ట్



దొంగల సమక్షంలో వివరాలు వెల్లడిస్తున్న సిమిలిగుడ పోలీసులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పిస్టల్, నగదు

కొరాపుట్: దారి దోపిడీ దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పోలీసులు ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన గంజాం జిల్లా గోలంత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో సోలబింద గ్రామానికి చెందిన మధుసూదన్ మహంతి సిమిలిగుడ పోలీస్ స్టేషన్ పరిధి జాతీయ రహదారి సమీపంలోని బంగారుగుడ జంక్షన్ వద్ద ఉన్నారు. ఇదే సమయంలో ఐదుగురు యువకులు ధుసూదన్ మహంతి వచ్చి తుపాకీ చూపించి అతని వద్ద ఉన్న రు.15 వేలు నగదు, మొబైల్ ఫోన్ లాక్కొని పట్టుకుపోయారు. దీంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి పొట్టంగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగరాజ్‌పూర్‌కి చెందిన కునా బంక, హరిజన్ వీధికి చెందిన అమర్ ఖోస్లా, దంబాగుడకి చెందిన ఆకాష్ ఖోస్లాలను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు మైనర్లు నిందితులుగా ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. వారి నుంచి ఫిస్టల్, రు. 9,600 నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఆదివారం సాయంత్రం జైలుకి తరలించారు. కేసుని ఎస్‌ఐ బాబాజీ కన్వర్ దర్యాప్తు చేస్తున్నారు.

అడవిలో మహిళ మృతదేహం లభ్యం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి గుముక పంచాయతీ సమీప అడవిలో ఆదివారం ఉదయం ఓ మహిళ మృతదేహం దొరికింది. కలిమెల సమితి ఎంవీ 10 గ్రామానికి చెందిన జ్యోత్స్న దేహురి(46) అనే మహిళ శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త అమల్ దేహురీ గ్రామంలో అంతా వెతికినా ఎక్కడా ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో శనివారం ఉదయం కలిమెల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం ఆమె మృతదేహం చెట్టుకు వేలాడుతూ స్థానికులకు కనిపించింది. వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులకు విషయం చెప్పారు. కలిమెల ఐఐసీ ముకుందో మేల్క తన సిబ్బందితో వచ్చి మృతదేహన్ని పరిశీలించి తలపై గాయం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం కోసం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. భవానీపట్నం నుంచి సైంటిఫిక్ బృందం సోమవారం వస్తే వారి సమీక్షంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు.

గజపతి జిల్లా పర్యాటక రంగానికి రూ.377 కోట్ల పెట్టుబడులు



కలెక్టర్ కార్యాలయం హాలులో వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి: గజపతి జిల్లాకు మహర్దశ పట్టనుంది. జిల్లాలో రూ.377 కోట్ల పెట్టుబడులతో చిన్న, సూక్ష్మ పరిశ్రమలు స్థాపన, జిరంగో వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, చంద్రగిరిలో బౌద్ధ మందిరాల వద్ద ఫైవ్ స్టార్ హోటళ్లు, మహేంద్రగిరి వద్ద రిసార్టులను ప్రత్యూష్ ఇండస్ట్రీస్ గ్రూప్ నెలకొల్పనున్నట్లు కలెక్టర్ మధుమిత జిల్లా కలెక్టరేట్‌లో అధికారుల సమావేశంలో తెలియజేశారు. దీని ఇడ్కో ద్వారా 20 ఎకరాల భూమిని సేకరించారు. రెండు నెలల్లో ఈ పనులు ప్రారంభమవుతున్నట్టు కలెక్టర్ అధికారులకు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 90 విలాసవంతమైన రిసార్టుల నిర్మాణాలు జరుగుతాయి. కాశీనగర్ ప్రాంతంలో 8 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్ స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. కాశీనగర్‌లో సోలార్ పవర్ ప్లాంటు, ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టులు నిర్మించడానికి రాష్ట ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుల పెట్టుబడుల వల్ల జిల్లాలో యువతకు ప్రత్యక్షంగా 10 వేలమందికి ఉపాధి లభించగలదు. అలాగే పరోక్షంగా మరో 10 వేల మందికి ఉపాధి పొందుతారని కలెక్టర్ మధుమిత వివిధ విభాగాల అధికారులతో సమావేశంలో తెలిపారు. సమావేశంలో ప్రత్యూష గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ డైరక్టర్ దివ్యస్తా మహంతి పాల్గొన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అనుప్ పండాతోపాటు జిల్లా పరిశ్రమల అధికారి సునారాం సింగ్, రోడ్లు-భవనాల శాఖ, యస్.ఈ. అభిషేక్ శెట్టి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి దక్షత అధికారి సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో సేవా పక్వాడా ఉత్సవాలు ప్రారంభం



స్టేడియం వద్ద మాస్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఏడీఎం ఫల్గునీ మఝి



గజపతి స్టేడియం నుంచి మాస్ మారథాన్‌లో పాల్గొన్న పోలీసు, ఎన్‌సీసీ క్యాడెట్లు

పర్లాకిమిడి: సేవా పక్వాడా ఉత్సవాలను స్థానిక గజపతి స్టేడియం వద్ద ఆదివారం ఉదయం అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఫల్గుణి ప్రారంభించారు. ఈ మాస్ మారథాన్ స్టేడియం నుంచి బీఎన్ ప్యాలస్, మెడికల్ జంక్షన్, తిరిగి కలెక్టరేట్ వరకూ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యువక్రీడా, సేవా విభాగం, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఈ సేవా పక్వాడా ఉత్సవాలను జరిపారు. వచ్చే నెల 2 వరకూ ఈ పక్వాడా ఉత్సవాలు జరుపుకుంటామని ఏడీఎం ఫల్గునీ మఝి తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై అవగాహన కోసమే మాస్ మారథాన్ నిర్వహించినట్టు జిల్లా క్రీడాధికారి, డిప్యూటీ కలెక్టర్ లాబంధు మహంతి తెలిపారు. మాస్ మారథాన్‌లో జిల్లా శారీరక క్రీడాధికారి సురేంద్ర పాత్రో, డీపీఆర్ఓ ప్రదీప్త గురుమయి, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



గజపతి స్టేడియం వద్ద మాస్ మారథాన్ ప్రారంభిస్తున్న ఏడీఎం ఫల్గునీ మఝి

చారిత్రక దసరా వేడుకలకు ముస్తాబు



ఆకర్షణీయంగా రూపు దిద్దుకొన్న రాజ్‌మహల్



దర్బారు హాలు పై విక్రమ్ దేవ్ మహారాజు బంగారు ప్రతిమ

జయపురం:

చరిత్రాత్మక జయపురం దసరా ఉత్సవాలకు జయపురం రాజ్‌మహల్‌లో గల భవనాలు అందంగా ముస్తాబవుతున్నాయి. సువిశాల రాజమహల్‌లో గల దర్బారు హాలు, రాజుల, రాజ పరివార నివాసాలు, జయపురం మహారాజుల కుల దేవత కనకదుర్గ మందిరం తదితర భవనాలకు రంగులు వేస్తున్నారు. దసరా వేడుకల్లో రాజభవనాలు తిలకించేందుకు అవిభక్త కొరాపుట్‌లోని అనేక గ్రామాల నుంచి వేలాది మంది గ్రామీణులు, వివిధ గ్రామ దేవతల ఘటాలతో వస్తారు. వీరు పూజారు, దిసారీలు, రాజ మహల్ ప్రాంగణంలోగల కనకదుర్గ మందిరంలో దేవిని దర్శించి పూజలు చేస్తారు. రాజుల పాలనా సమయంలో జయపురం రాజులు తమ కులదైవానికి 16 దినాలు పూజలు చేసి దసరా రోజున అనేక అంబారీలపై రాజ పరివారం, అతిథి రాజులు, ఆంగ్లేయులు పట్టణంలో దేవీ మూర్తులను ఊరేగించేవారు. అయితే ఆనాటిలా ఏనుగులు లేక పోయినా ఆనాటి సాంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.





రాజ్ మహల్ అందాలు



రంగులు వేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

మా భగవతి దేవి దర్శనం



మహాలయ అమావాస్య దినాన భక్తులకు దర్శనమిచ్చిన మా భగవతి

జయపురం: ఆదివారం మహాలయ అమావాస్య పర్వదినాన పట్టణంలో ప్రధాన దేవీమా భగవతి భక్తులకు విశేష అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. మహాలయ అమావాస్య దినాన వందలాది మంది భక్తులు మా భగవతిని దర్శించి పూజలు చేశారు.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరిస్తూ.. గోత్రనామాలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం చేయించి తీర్థప్రసాదాలె అందజేసారు. ఈయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, ప్రోటోకాల్ సిబ్బంది ఉన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే సుగాలి ప్రీతి కేసు విచారణకు తొలి సంతకం చేస్తానన్న హామీ ఏమైందని ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ పావని ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలో ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులపై జరుగుతున్న దాడులను, వేధింపులను అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ సరఫరా చేయాలన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదన్నారు. అనంతరం జిల్లా గర్ల్స్ కన్వీనింగ్ కన్వీనర్‌గా పి.దివ్య, కో–కన్వీనర్‌గా నందినిలను నియమించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పి.పవిత్ర, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణారావు

పాతపట్నం: జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాం రమణారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పాతపట్నం గిరిజన సామాజిక భవనంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా గురాడి అప్పన్న, సెక్రటరీగా జన్నివలస షణ్ముఖరావు, జాయింట్ సెక్రటరీగాఎన్ని దిలిప్‌కుమార్, ట్రెజరర్‌గా జమ్ము లోకేశ్వరరావు, సలహాదారుడిగా మాణిక్యాల రావులతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర వ్యాయామ సంఘం అధ్యక్షుడు ఎన్ని శేఖర్‌బాబు తెలిపారు. వీరిని పాతపట్నం డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొండాల చక్రపతి, పీడీలు, పీఈటీలు అభినందించారు.

నాయీ బ్రాహ్మణులను కించపరచడం తగదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నాయి బ్రాహ్మణ కులాన్ని ఎగతాళి చేసి కించపరిచేలా మాట్లాడిన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొరుపూరు గజపతిరావు, ఎస్.వి.జగన్నాథం ఆదివారం డిమాండ్ చేశారు. ఇప్పటికే రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగాలలో వెనుకబడి ఉన్న తమ కులాన్ని కించపరచడం భావ్యం కాదన్నారు. సమాజంలో నాయీ బ్రాహ్మణుల పాత్ర అత్యంత విలువైందని, గ్రామాలు విడిచి పట్టణ ప్రాంతానికి వలసపోయే పరిస్థితుల్ని కొందరు రాజకీయ నాయకులు అగ్రకుల దురంహకారులు తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు.

సమాజానికి వెలుగుజాడ గురజాడ

శ్రీకాకుళం అర్బన్: సమాజ జాగృతికి వెలుగు జాడ మహాకవి గురజాడ అప్పారావు అని గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన మహాకవి గురజాడ జయంతి వేడుకలు ఆదివారం శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధులు సంఘసంస్కర్తల స్మృతి వనంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాతలు జామి భీమశంకర్, పత్తి సుమతి, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, నక్క శంకరరావు, కొమ్ము రమణమూర్తి తదితరులు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులోయ్ అని చాటి చెప్పిన గురజాడ స్ఫూర్తి సజీవంగా నిలిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, మెట్ట అనంతం భట్లు, శాస్త్రి, సువ్వారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ఘటనా స్థలంలో సహాయక బృందాల పర్యవేక్షణ



పేలుడు తాకిడితో ప్రభావితమైన పరిసరాలు



పేలుడు పరిసరాల్లో దెబ్బతిన్న ఇళ్లు

బాణసంచా పేలుడు

- ఒకరి మృతి, 8 మందికి గాయాలు
- పెరుగుతున్న మృతుల సంఖ్య

భువనేశ్వర్: హర్భంగా, బౌధ్ జిల్లా పాత కటక్ సమీపం జియాన్‌కొటా గ్రామంలో బాణసంచా పేలుడు సంభవించింది. ఆదివారం జరిగిన ఈ విషాద సంఘటనలో అధికారికంగా ఒకరు మృతి చెందారు. 8 మంది గాయపడ్డారు. మృతుడిని లక్ష్మీధర్ బెహరాగా గుర్తించారు. ఇంట్లో బాణసంచా నిల్వ ఉండగా నిప్పు రవ్వలు తాకడంతో పేలుడు సంభవించిందని అనుమానిస్తున్నారు. ఈ సంఘటన అత్యంత భయానకంగా సంభవించిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణ భయంతో ఇల్లు వాకిలి విడిచి పరుగులు తీశారు. ఈ హింసాత్మక పేలుడులో మృతదేహం ముక్కలు ముక్కలైందని ప్రత్యక్ష సాక్షుల కథనం. ఈ సంఘటనలో ఒక నివాస భవనం కుప్పకూలింది. పేలుడు తీవ్రతతో పరిసరాల్లో మరికొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుని ఉండవచ్చనే భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు.



పేలుడులో దెబ్బ తిన్న వాహనం

ఈ సంఘటనలో మరణించిన ఒక వ్యక్తి ఆచూకీ ఖరారైంది. మరో వ్యక్తి కూడ దుర్మరణం పాలైనట్లు అనధికారిక సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భయానక పరిస్థితుల దృష్ట్యా సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పేలుడుకు గురైన భవనాన్ని అక్రమ బాణసంచా గోడౌన్‌గా ఉపయోగించి అక్కడ బాణ సంచా తయారు చేయడంతో ఈ విషాద సంఘటన సంభవించిందని స్థానికుల ఆరోపణ. పేలుడు చాలా తీవ్రంగా ఉండటంతో సమీపంలోని దుకాణాలు, కొన్ని ఇళ్లు దెబ్బతిన్నాయి. ప్రాణహాని, ఆస్తి నష్టం సంబంధిత సమాచారం అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బందితో సహా అత్యవసర బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు కృషి చేస్తున్నారు.



పేలుడుతో కుప్ప కూలిన భవనం

సమితిస్థాయి ఆటల పోటీల ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడలో బొయిపరిగుడ సమితి స్థాయి ఆటల పోటీలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధ చౌదరి ముఖ్యఅతిథిగా పోటీలను ప్రారంభించారు. బొయిపరిగుడ సమితి విద్యాధికారి సుకాంత కర్తామి క్రీడా జ్యోతి ముట్టించి పోటీలు ప్రారంభమైనట్టు ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులోపాటు క్రీడల్లో రాణించాలని హితవు చెప్పారు. చదువు విజ్ఞానానికి, మనోవికాసానికి దోహద పడగా ఆటలు శారీరక ఆరోగ్యానికి ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఆటలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడా ఉపాధ్యాయులు సునీల్ కుమార్ దాస్ మాట్లాడుతూ నేడు ప్రారంభమైన పోటీలలో సమితిలో గల 19 పాఠశాలలను నాలుగు జోన్‌లుగా విభజించామని ప్రతీ జోన్ 5 ఈ వెంట్స్ ఆడతాయని వివరించారు.ప్రతి జోన్‌లో 40 మంది క్రీడాకారులు పాల్గొంటారని మొత్తం ఈ పోటీలలో మొత్తం 160 మంది పాల్గొంటున్నారని తెలిపారు. వీరిలో 70 మంది ఉత్తమ క్రీడాకారులు ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలక పంపటం జరుగుతుందని వెల్లడించారు.ఈ పోటీలలో 8 రకాల ఆటల పోటీలు నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రదీప్ కుమార్ టర్కి ఇతర ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గున్నారు.

సిమిలిగుడకు సబ్ డివిజన్ హోదా కల్పించాలి



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీతం పాఢీ, వేదిక మీద చైర్మన్ రాజేంద్ర పాత్రో

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సిమిలిగుడని ప్రత్యేక రెవిన్యూ సబ్ డివిజన్‌గా హోదా కల్పించాలని అఖిల పక్ష కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలో బస్టాండ్ వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో వక్తలు ప్రసంగించారు. సబ్ డివిజన్‌కి ఉండాల్సిన అన్ని అర్హతలు సిమిలిగుడకి ఉన్నాయని గుర్తు చేశారు. ఈ డిమాండ్ అనేక ఏళ్లుగా ఉందన్నారు. రాష్ట్రంలో అనేక పట్టణాలను ఎన్ఏసీ, మున్సిపాలిటీలుగా హోదా పెంచిందని గుర్తు చేశారు. ఈ హోదా కోసం పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కలసి ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. విస్తరించిన సిమిలిగుడ పట్టణం సబ్ డివిజన్‌గా మారితే విద్య, ఆర్థిక, ఉపాధి రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఈ ఉద్యమం విడతల వారి ముందుకు సాగుతూ ప్రభుత్వం స్పందించేలా కొనసాగించాలని సమావేశం నిర్ణయించింది. సునాబెడా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రాజేంద్ర కుమార్ పాత్రో, మాజీ ఎమ్మెల్యేలు పీతం పాఢి, రఘురాం పాడాల్, ప్రఫుల్ల పంగి, బీజేపీ నాయకుడు సుమంత్ ప్రధాన్ పాల్గొన్నారు.



సభలో అఖిలపక్ష నాయకులు

సమితి ఉపాధ్యక్షుడిపై చర్యకు డిమాండ్



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సమితి సభ్యురాలు, సర్పంచ్‌లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి ఉపాధ్యక్షుడు నిరంజన్ హల్దార్ ఏకపక్ష నిర్ణయాలు, ప్రజలపై ఆయన ప్రవర్తనకు వ్యతిరేకంగా సర్పంచ్‌లు రంగంలోకి దిగారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా సబ్ కలెక్టర్ అశ్వి ఏ ఎస్‌కి మల్కన్‌గిరి సమితి అధ్యక్షురాలు గౌరి పోడియమి అధ్యక్షతన 20 మంది సర్పంచ్‌లు శనివారం వినతిపత్రం అందజేశారు. రెండు సంవత్సరాలుగా ఆయన సమితి ఉపాధ్యక్షుడిగా ఉంటూ సర్పంచ్‌లపట్ల దురుసుగా వ్యవహరించడం, సమితి అభివృద్ధిని పటించుకోవడం లేదని అధికారులకు వివరించారు. ప్రజలకు అందవలసిన ఆవాస్ యోజన పథకాల్లో అక్రమాలకు పాల్పడున్నట్టు పేర్కున్నారు. సబ్ కలెక్టర్ అశ్వి మాట్లాడుతూ.. నిరంజన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోపణలు రుజువైతే అధికార్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రైలు నుంచి దిగిపోయిన చిన్నారి



తప్పిపోయిన బాలుడు

శ్రీకాకుళం అర్బన్: పలాస రైల్వేస్టేషన్‌లో తల్లిదండ్రులు, బంధువులు లేకుండా తిరుగుతున్న ఓ చిన్నారిని రైల్వే అధికారులు గుర్తించి శ్రీకాకుళంలోని అరసవల్లిలోగల శిశుగృహానికి తరలించారు. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ నుంచి పలాస రైల్వేస్టేషన్‌లో ఒక బాలుడు (వయసు సుమారు 3 సంవత్సరాలు) ఒంటరిగా దిగిపోయాడు. ఈ విషయాన్ని ప్రయాణికులు 139 నంబరు ద్వారా సమాచారం ఇవ్వగా, అక్కడే ఉన్న ఆర్పీఎఫ్ సిబ్బంది బాలుడిని చైల్డ్ హెల్ప్‌లైన్‌కి అప్పగించారు. ఆ చిన్నారి తల్లిదండ్రుల గురించి విచా రించినా ఎవరూ ముందుకు రాలేదు. తప్పిపోయిన బాలుడికి ఏం అడుగుతున్నా చెప్పలేకపోవడంతో ఆ బాలుని వివరాలు అందుబాటులోకి రాలేదు. అనంతరం బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ఆ చిన్నారిని శ్రీకాకుళంలోని అరసవల్లి శిశుగృహలో చేర్పించారు. బాలుడికి సంబంధించి తల్లిదండ్రులు లేదా బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, శ్రీకాకుళంను సంప్రదించాలని అధికారులు కోరారు.

నలుగురు యువకుల అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి రామగిరి వారం సంతలో మామూళ్లు వసూలు (దాదాగిరి) చేస్తున్నారన్న ఆరోపణలపై బొయిపరిగుడ పోలీసులు ఆదివారం నలుగురు యువకులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారు రామగిరి వాసులని పోలీసులు వెల్లడించారు. కిరణ్ దొంగిరి, రంజిత్ సాగర్, భగవాన్ ఖొర, ఆకాశ సాగర్‌లు రామగిరిలో జరిగే ప్రతి వారం సంతలో వ్యాపారులను, ఆటోలవారిని, బైక్‌లపై వచ్చే వారిని అడ్డగించి బలవంతంగా మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గత వారపు సంతలో రామగిరి వాసి అయిన ఆటో వాలా అజయకుమార్ బారిక్‌ను వీరు మామూళ్లు అడిగారు. అతను నిరాకరించాడు. అందుకు ఆగ్రహించిన నిందితులు ఈ నెల 13వ తేదీన బారిక్ ఆటోను లాక్కుపోయి బయట విసివేశారు. ఈ సంఘటనపై ఆటోవాలా బొయిపరిగుడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ఎరువుల సంక్షోభాన్ని నివారించాలి

- గవర్నర్‌కు బీజేడీ అభ్యర్థన



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేడీ ప్రతినిధులు

భువనేశ్వర్: ఎరువుల సంక్షోభంతో రాష్ట్ర రైతులు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం చోద్యం చూస్తోందని, విపక్షాల ఆవేదన అరణ్య రోదనగా మిగిలిపోతోందని, ఈ పరిస్థితుల నివారణకు చొరవ చూపాలని కోరుతూ బీజేడీ నాయకుల ప్రతినిధి బృందం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటిని ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో ఎరువులు అందించలేదన్నారు. ఎరువులు నల్ల బజారులో విరివిగా విక్రయిస్తున్నారన్నారు. రైతులు పరిమిత ఎరువుల కోసం గంటల తరబడి బారులు తీరినా దొరకడం లేదన్నారు. ప్రభుత్వం ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రకటనలు చేస్తోందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన 45 కిలోల బస్తా ఎరువు ధర రూ.242 కాగా. రూ.800 నుంచి రూ.1000కి నల్ల బజారులో ఎరువులు లభిస్తున్నాయన్నారు. మార్క్‌ఫెడ్ వంటి సంస్థలు సబ్సిడీ ఎరువులను దారి మళ్లిస్తున్నాయని, వీటిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ దృష్ట్యా రాష్ట్రంలో ఎరువుల కొరత నివారణ కోసం కాపాడటానికి కేంద్రం తక్షణ జోక్యం కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ ఇటీవల కేంద్ర రసాయనాలు, ఎరువుల విభాగం మంత్రికి రాసిన లేఖను కూడా ప్రతినిధి బృందం గవర్నర్ వద్ద ప్రస్తావించింది.

ప్రమాదకర ప్రయాణం



ఆటో వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న విద్యార్థులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కేంద్రంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకార ప్రయణాలు చేయాల్సి వస్తోంది. దీనిపై జిల్లా రవాణా, పోలీసు శాఖ దృష్టి పెడితే పిల్లలను రక్షించగలం. ముఖ్యంగా ప్రభుత్వం స్కూల్ పిల్లల కోసం ఉచిత బస్సులు వేస్తామని ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచుకోలేదు. ఆటోల్లో విద్యార్థులను కిక్కిరిసేలా కూర్చోబెడుతున్నారు. కొంతమంది డ్రైవర్ల నిర్లక్ష్య ధోరణి వల్ల ఆటోలు బోల్తాపడి విద్యార్థులు గాయపడుతున్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని కలిమెల వాసులు కోరుతున్నారు.

గంజాయితో ఐదుగురు అరెస్టు

పలాస: మూడు కేసుల్లో ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు గంజాయితో పట్టుబడినట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గొయిబంద గ్రామానికి చెందిన జిసియా గుంట, అతని భార్య స్వప్నబిబార్‌లు గుణుపూర్ నుంచి 40.240 కిలోల గంజాయిని రెండు ట్రాలీ బ్యాగుల్లో పట్టుకొని బస్సులో బయలుదేరి పలాసలో దిగారు. అక్కడి నుంచి నడుచుకుంటూ పలాస రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. అలాగే తమిళనాడు రాష్ట్రం విజయరాఘవపురం గ్రామానికి చెందిన గాయిత్రి అనిఫ్, సుభాస్(అన్నా చెల్లెళ్లు) ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి పలాస బస్సులో వచ్చి రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 28.860 కిలోల గంజాయి, సెల్‌ఫోన్, రూ.540 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వీల్‌చైర్ అందజేత



దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: ఆర్.ఉదయగిరిలో జిల్లా కలెక్టర్ మధుమిత ఆదివారం పర్యటించారు. చెలిగడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు సురేంద్ర చాంచానికి వీల్‌చైర్ అందజేశారు. ఆర్.ఉదయగిరి తహసీల్దార్ మోనాలిసా ఆచార్య, జిల్లా సామాజిక సురక్ష, దివ్యాంగుల స్వశక్తికరణ అధికారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలేరు అమావాస్య పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



కూరగాయల మార్కెట్‌లో సందడి



పోలేరు అమ్మవారికి పూజలు

రాయగడ: పోలేరు అమావాస్య పూజలు ఆదివారం భక్తి శ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. స్థానిక రామలింగేశ్వర మందిరంలో కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. తొమ్మిది రకాల పిండి వంటలతో పాటు వివిధ రకాల కూరగాయాలతో వంటలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజల్లో అధికంగా పాల్గొన్నారు. పోలేరు అమావాస్య సందర్భంగా స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన గల కూరగాయల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

ఘనంగా అంతర్జాతీయ శాంతి దినోత్సవం

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో గజపతి జిల్లా స్కౌట్స్, గైడ్స్ మాస్టర్ల నేతృత్వంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ డాక్టర్ కాళీప్రసాద్ మిశ్రా, డీఈఓ మాయాధర్ సాహు ఆదేశాల మేరకు అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. శాంతితో సమృద్ధి, శక్తి, శాంతి పథంలో మనవుల విజయం లభిస్తుందని జిల్లా స్కౌట్స్ కార్యదర్శి సురేంద్ర కుమార్ పాత్రో అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. డీఓసీ ప్రియదర్శి మిశ్రా, సంయుక్త కార్యదర్శి పరమేశ్వర్ నాయక్, కిశోర్ చంద్ర దాస్, దిరేంద్ర కుమార్ సామల్, రాజ్‌కిశోర్ పాత్రో, గైడ్స్ కెప్టెన్ మహారాజా బాలుర ఉన్నత విద్యాలయం, బాయ్స్ స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

క్లుప్తంగా

గల్లంతైన యువకుడిని రక్షించిన పోలీసు సిబ్బంది


గల్లంతైన యువకుడితో పోలీస్ అధికారులు

గజపతినగరం: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో ఉన్న సూర్యనారాయణ గ్రానైట్ కంపెనీలో పని చేస్తున్న 8మంది రాజస్తాన్ యువకులు విశాఖ పట్నం ఆర్కేబీచ్‌ను ఆదివారం సందర్శించి స్నానానికి దిగారు. స్నానానికి దిగిన వారిలో భవాని సింగ్ (25) సముద్ర కెరటాలకు గల్లంతయ్యాడు. ఆ సమయంలో విధుల్లో ఉన్న మెరైన్ పోలీసు సిబ్బంది జీఎం నాయుడు, జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ పోలిరాజు, గుర్నాథ్‌లు ఆ యువకుడిని కాపాడారు. భవానిసింగ్ ఆరోగ్యం నిలకడగా ఉన్న తర్వాత కుటుంబసభ్యులకు అప్పగించారు.

పిడుగు పడి పాడి ఆవు మృతి


మృతి చెందిన పాడి ఆవు

రామభద్రపురం: మండలంలోని మిర్తివలస జంక్షన్ వద్ద పిడుగు పడడంతో ఓ పాడిఆవు మృతి చెందింది. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తారాపురం గ్రామానికి చెందిన పాడి రైతుల పశువులతో పాటు అదే గ్రామానికి చెందిన పాటు పిల్ల మంగ తన పాడి ఆవును మేత కోసం గ్రామ సమీపంలోని మిర్తివలస జంక్షన్ వద్దకు తోలింది. అయితే అక్కడ ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వర్షం పడుతుండగా పాడి ఆవుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పిడుగు పడే ప్రాంతానికి దూరంలో మిగిలిన ఆవులు మేస్తుండడం,అలాగే వర్షానికి పాడి రైతులు కూడా పక్కనే ఉన్న షెడ్డులలోకి వెళ్లడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. మృతి చెందిన పాడి ఆవు ఖరీదు దాదాపు రూ.50వేల పైబడి ఉంటుంది. పిడుగు పాటుకు గురై మృతి చెందిన ఆవును చూసి రైతు మంగ లబోదిబో మంటూ ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతోంది.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- నిందితులపై కేసు నమోదు

సీతంపేట: మండలంలోని కొండాడ పంచాయతీ పరిధిలోని బెనారయి గ్రామానికి చెందిన కూరంగి రమేష్, ఆరిక నాగేశ్వరరావు, బిడ్డిక కామేశ్వరరావులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని వారి నుంచి రూ.7.50 లక్షలు వసూలు చేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కోదుల వీరఘట్టం గ్రామానికి చెందిన గంట కమాలకర్, రత్నలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అమ్మన్ రావు ఆదివారం తెలిపారు. బాధితులకు స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్, పాఠశాలలో అటెండరుగా పోస్టులు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.2.50 లక్షలు చొప్పున వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్న మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పూరిల్లు, పశువుల పాక దగ్ధం


ప్రమాదంలో కా బూడిదైన పూరిల్లు, పశువుల శాల

బొండపల్లి: మండలంలోని తమటాడ గ్రామంలో ఆదివారం వేకువ జామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లుతో పాటు పశువుల పాక దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోండ్రు రమణమ్మ పూరింటికి మంటలు వ్యాపించడంతో పూర్తిగా ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న తులం బంగారు ఆభరణాలు కాలిపోవడంతో పాటు గ్యాస్ సిలిండర్ కూడా పేలిపోయింది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఇదే ప్రమాదంలో పక్కనే ఉన్న పశువుల శాల కూడా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడు లక్షల వరకు ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు జె.కామేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.రంగరాజు డిమాండ్ చేశారు. అమర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా స్వల్ప జీతాలతో పని చేసి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఇప్పటికీ సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులను భర్తీ చేయాలని, సచివాలయాల్లో తగిన సిబ్బందిని నియమించిన ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని కోరారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులకు పండగ సెలవులు అమలు చేసి, పనిముట్లు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా మున్సిపల్ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదన్నారు. సమావేశంలో తుపాకుల శ్రీను, దల్లె శ్రీను, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ రగడ

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు అవమానంపై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో తీవ్ర చర్చ
- పాలకొండ ఎంపీడీఓపై చర్యలు తీసుకున్నాకే సమావేశమంటూ ప్రకటించిన జెడ్పీ చైర్‌పర్సన్ విజయ
- ఎమ్మెల్సీకి మద్దతుగా సభ్యుల వాకౌట్
- జెడ్పీ సీఈఓ పాత్రపై కూడా విచారణ జరిపించాలన్న ఎమ్మెల్సీ విక్రాంత్

సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయ తదితరులు


అరసవల్లి: జిల్లా పరిషత్ చరిత్రలో తొలిసారిగా సర్వసభ్య సమావేశంలో అధ్యక్షురాలితో సహా సభ్యులంతా వాకౌట్ చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వైఎస్సార్ సీపీకి చెందిన శాసన మండలి సభ్యుడు పాలవలస విక్రాంత్‌ను ఇటీవల పాలకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరుకాకుండా నిలువరించడమే కాకుండా భౌతిక దాడికి సైతం పాల్పడిన సంగతి విదితమే. దీనిపై ఆదివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ఈనెల 16న పాలకొండలో జరిగిన ఈ ఘటనకు బాధ్యుడైన పాలకొండ ఎంపీడీఓపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా తిరిగి జెడ్పీటీసీ సభ్యులపై అమానుషంగా ఏకవచనంతో మాట్లాడిన జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజాపై విచారణకు ఆదేశించాలని సభ్యులంతా పట్టుపట్టడంతో సభ హీటెక్కింది. అనంతరం సీఈఓ తీరును నిరసిస్తూ సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓపై ధ్వజం

ఎమ్మెల్సీ విక్రాంత్‌కు జరిగిన అవమానంపై జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు స్పందిస్తూ ఘటన జరిగి ఐదు రోజులవుతున్నా ఎంపీడీఓపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా బదులిస్తూ కమిషనర్‌కు నివేదించానని, తదనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో 'నేను చెప్పింది వినుముందు' అనడం సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్‌ను ఏకవచనంతో పిలవడమేంటని పోడియంను చుట్టుముట్టారు. జెడ్పీ చైర్ పర్సన్ కూడా జత కలిశారు. పాలకొండ ఎంపీడీఓపై చర్యలు తీసుకునేంత వరకు సభ జరగదని అంతా వాకౌట్ చేశారు. సభలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, హిరమండలం టీడీపీ జెడ్పీటీసీ బుచ్చిబాబు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్‌లు మాత్రమే కూర్చుండిపోయారు. అనంతరం సభ వాయిదా పడిందని జెడ్పీ సీఈఓ ప్రకటించారు.


జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా వైఖరిపై మండిపడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు

ప్రోటోకాల్ పాటించాలి..



జిల్లాలో అన్ని శాఖల అధికారులు స్థానిక సంస్థల ప్రతినిధులకు ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలి. ప్రోటోకాల్ పాటించాలి. ప్రోటోకాల్ విషయంలో అనుమానాలు ఉంటే జిల్లా రెవెన్యూ అధికారిని సంప్రదించాలి. ఇచ్ఛాపురం ప్రోటోకాల్ ఉల్లంఘన నా దృష్టికి వచ్చింది. ఇలాంటివి మళ్లీ జరగకూడదు. పాలకొండ అంశంపై జెడ్పీ సీఈఓ విచారణ జరపాలి.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

సభలో ఆందోళన

- టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్న చట్టసభ్యులందరికీ గౌరవంగా ప్రోటోకాల్ పాటించామని గుర్తుచేశారు. గతంలో ఆహ్వానాలు పంపినా అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు ఏనాడూ రాలేదన్నారు.
- వంగర ఎంపీపీ సురేష్ ముఖర్జీ మాట్లాడుతూ ఎమ్మెల్సీకి సమావేశానికి ఆహ్వానించి మళ్లీ వెనక్కి తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు.
- ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి మాట్లాడుతూ ప్రతి సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆప్షన్ల ప్రకారం శాశ్వత ఆహ్వానితులే అని గుర్తుచేశారు. చట్టసభ్యులనే లోపలికి రానివ్వని సంస్కృతి దారుణమన్నారు.
- జి.సిగడాం జెడ్పీటీసీ కాయల వెంకట రమణ మాట్లాడుతూ జిల్లాలో అన్ని స్థాయిల్లో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లకు, ఎంపీపీలకు, జెడ్పీటీసీలకు కూడా ప్రోటోకాల్ పాటించడం లేదని తెలిపారు.
- రాజాం జెడ్పీటీసీ నర్సింహులు, బూర్జ జెడ్పీటీసీ రామారావు, రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం, వీర ఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, సీతంపేట జెడ్పీటీసీ బిడ్డిక ఆదినారాయణ, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత్‌రెడ్డిలు మాట్లాడుతూ విక్రాంత్‌కు జరిగిన అవమానం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు.

నన్ను దారుణంగా అవమానించారు



ఈ నెల 16న పాలకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆహ్వానం మేరకే వెళ్లాను. కానీ నన్ను లోపలకు వెళ్లనివ్వలేదు. నాకు ఆప్షనల్ నియోజకవర్గమైన పాలకొండలో మండల సమావేశానికి రాకుండా ముఖద్వారం వద్దనే ఆపేశారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు భౌతికంగా తోసేశారు. నన్ను దారుణంగా అవమానపరిచారు. ఆహ్వానం పంపిన ఎంపీడీఓను వివరణ అడిగితే 'అవగాహన లేక పని ఒత్తిడిలో చూసుకోక ఆహ్వానం పంపించాం.. ఆహ్వానాన్ని వెనక్కి తీసుకుంటున్నామంటూ.' లేఖలో సమాధానం ఇచ్చారు. ఇలాంటి అధికారులతో ప్రభుత్వం పని చేయించుకుంటుందా. ఒక ఎమ్మెల్సీగా నాకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే జెడ్పీటీసీలు, ఎంపీపీల పరిస్థితి ఏంటి. ఘటన జరిగి ఐదు రోజులవుతున్నా పాలకొండ ఎంపీడీఓపై ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలి. జెడ్పీ సీఈఓపైనా విచారణ జరగాలి.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

నన్నే చాలాసార్లు పిలవలేదు



చట్ట సభ్యులను కూడా అవమానించడం దారుణం. ఇటీవల ఇచ్ఛాపురంలో జిల్లా పరిషత్ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ పథకాల ప్రారంభోత్సవానికి నాకు కనీసం సమాచారమైనా ఇవ్వలేదు. దీనిపై ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. నాకు కాకపోయినా ఈ చైర్‌కు అయినా విలువ ఇవ్వాలి కదా.

– పిరియా విజయ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక


జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యాలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలకు ఆదివారం పూర్తయ్యాయి. నగర శివారులో గల విజ్జి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఎంపిక పోటీలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. వారికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్స్, త్రో, జంప్స్ అంశాల్లో ఎంపికలు నిర్వహించగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 27 28,29 తేదీల్లో ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు విజయనగరం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సీతారామరాజు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ కేవీఎన్ రాజు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని లెక్కచేయని ప్రైవేటీకరణ

- ఎమ్మెల్సీ సురేష్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

భోగాపురం: రాష్ట్రప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నడపాలని తీసుకున్న నిర్ణయం ప్రజల ఆరోగ్య భద్రతకు తీవ్ర ముప్పు తెచ్చిపెడుతుందని ఎమ్మెల్సీ సురేష్‌బాబు విమర్శించారు. 'ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తున్న మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పేరుతో అప్పగించడం తప్పుడు నిర్ణయం. ప్రైవేట్ యాజమాన్యం వస్తే ప్రజలకు చికిత్స ఖర్చులు గగనానికి ఎగుస్తాయి. కరోనా సమయంలో ప్రభుత్వ ఆస్పత్రులే ప్రజల ప్రాణాలు కాపాడాయి. రేపు కొత్త వైరస్ వస్తే కేరళలో జరుగుతున్నట్లు పరిస్థితులు తలెత్తితే పేదలకు వైద్యం అందకపోవచ్చు'' అని సురేష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు కాపాడే ప్రభుత్వ వైద్యరంగాన్ని ప్రైవేటీకరణకు అప్పగించకుండా వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీపీ ఉప్పాడ అనూష రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీ లను స్వీకరించనున్నట్లు కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించి స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ చెక్ చేసుకోవచ్చని చెప్పారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్సాప్‌లో అందజేస్తున్నామని, ఎండార్స్‌మెంట్‌ను రిజిస్టర్ పోస్ట్ ద్వారా సంబంధిత చిరునామాకు పంపిస్తున్నామని చెప్పారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి

అర్జీదారులు మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

గిరిజన ప్రాంతాల టీచర్ పోస్టులు గిరిజనులకే కేటాయించాలి


మాట్లాడుతున్న ట్రైబల్ రైట్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ వరహాలదొర

విజయనగరం అర్బన్: గిరిజన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను శతశాతం గిరిజనులకే కేటాయించి భర్తీ చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ వరహాలదొర డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక యూత్ హాస్టల్‌లో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆదివాసీ గ్రామాన్ని సందర్శించి, యువతీ యువకులను చైతన్యపరిచి ఉద్యోగాలు, వ్యాపార రంగాలలో స్థిరపడేలా చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు అనేక సమస్యలతో బాధపడుత్నురని కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నిరుద్యోగ గిరిజన యువత సరైన అవగాహన లేక ఇంటికే పరిమితమవుతున్నారని వారికి నైపుణ్యాభివృద్ధి ప్రోగ్రాంలు, ట్రెనింగ్, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించేందుకు మండల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రమోద్, మహిళా విభాగం అధ్యక్షురాలు నంద్యాల గిరిజ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఐఎస్ఎస్‌దొర, ప్రధాన కార్యదర్శిగా రాయల ధనంజయ్, ఉపాధ్యక్షులుగా బెటికరి ప్రసాద్‌రావు, జలుమూరి రామారావు, కోశాధికారిగా జోడు నాగరాజు, సహాయ కార్యదర్శులుగా ఎం.పండు, జె.రామారావులను ఎన్నుకున్నారు. అదే విధంగా ట్రైబల్ స్టూడెంట్స్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా హిమరిక గణేష్, ప్రధాన కార్యదర్శిగా పక్కి నవీన, ఉపాధ్యక్షులుగా సిధారపు పవన్, కిల్లక రోజా, కొప్పుల వాసవి, చోడిపల్లి గంగోత్రి, ఎ.కిరణ్ ఎంపికయ్యారు. ట్రైబల్ ఎంప్లాయిస్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా కొండగొర్ర గోపాల్, ప్రధాన కార్యదర్శిగా మానపురం వెంకటరమణను ఎన్నుకున్నారు.

బాల్యంలోనే.. బానిసలు కావద్దు

- పెరుగుతున్న స్మార్ట్ ఫోన్ల వినియోగం
- పిల్లలు, విద్యార్థులకు నష్టాలు
- అనర్థాలపై అవగాహన కలిగిస్తున్న పోలీసులు


రామభద్రపురం ఉన్నత పాఠశాలలో ప్రొజెక్టర్‌పై వివిధ అంశాలు ప్రదర్శిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: మాదక ద్రవ్యాల వినియోగంలో అధిక శాతం మైనర్లే ఉంటున్నారు. బాలలపై కేసులు నమోదైతే వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోతుంది. ఏది మంచో, ఏది చెడో తెలియని వయసులో విద్యార్థులు తప్పుడు విషయాలను బుర్రకెక్కించుకుటున్నారు, డ్రగ్స్, గంజాయి, ర్యాగింగ్‌లు, సైబర్ నేరాల పట్ల ఆకర్షితులవుతున్నారు. అవి విపరీతమైన అనర్థాలను కలిగిస్తున్నాయి.అయితే సంకల్పం కార్యక్రమం పేరుతో చెడు వ్యవసనాల వల్ల కలుగుతున్న అనర్థాలను ఆపడానికి పోలీసుశాఖ నడుం బిగించింది. ప్రభుత్వం,ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యాజమాన్య ప్రతినిధుల ఆధ్వర్యంలో సీఐ నారాయణరావు, ఎస్సై ప్రసాదరావులు ప్రొజెక్టర్‌పై వివిధ అంశాలను ప్రదర్శిస్తూ సమాజంలో విద్యార్థులకు సోషల్ మీడియా, డ్రగ్స్, గంజాయి, ర్యాగింగ్ సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ వల్ల జరుగుతున్న నష్టాలను వివరిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

- 14నుంచి 21 సంవత్సరాల లోపు పిల్లలు,యువత ఒంటరిగా ఫోన్ చూస్తుంటే తల్లిదండ్రులు గమనించాలి
- ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, స్నాప్‌చాట్ ఇతర యాప్‌లకు దూరంగా ఉండాలి.
- ఇంటర్ పూర్తయ్యే వరకు సెల్ ఫోన్ జోలికి వెళ్లకూడదు.
- కుటుంబసభ్యులతో కలిసి చూడవలసినవి మాత్రమే చూడాలి.రోజూ సెల్‌ఫోన్‌కు బదులు పత్రికలు,పుస్తకాలు చదవాలి. వీడియో గేమ్స్, రీల్స్ లైక్ కొడితే డబ్బులు వస్తాయని ప్రయత్నిస్తే సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉంది.


శ్రద్ధగా వింటున్న విద్యార్థులు

అప్రమత్తంగా ఉంటాను



సైబర్ నేరానికి గురైతే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలిసేది కాదు. పోలీసు అధికారులు 1930,112 నంబర్లకు ఫోన్ చేయాలని వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని,స్నేహితులకు, తల్లిదండ్రులకు చెబుతాను. ఓటీపీ బయట వారికి తెలియకుండా జాగ్రత్తపడతాం. సెల్‌ఫోన్ నంబర్లు, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు ఎవరికీ పంపకూడదని ఈ అవగాహన ద్వారా నాకు అర్థమైంది.

– సీహెచ్ శరణ్య, 10వ తరగతి విద్యార్థిని, రామభద్రపురం

చాలా ఉపయోగం



సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం, సోషల్ మీడియా, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వల్ల కలిగే అనర్థిలపై పోలీసు అధికారులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంతో ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. వివిధ అంశాలపై అవగాహన లేక మోసాలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా తెలుసుకున్న విషయాలను కుటుంబసభ్యులతో పాటు మా గ్రామంలోని సన్నిహితులకు తెలియజేసి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తాను.

– పి.సంధ్య, 10వ తరగతి విద్యార్థిని, రొంపల్లి

ఘనంగా మరిడమ్మ పండగ


ప్రభతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళుతున్న గ్రామస్తులు

శృంగవరపుకోట: మండలంలోని సీతారాంపురంలో గ్రామ దేవత మరిడమ్మ పండగను సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు, గ్రామపెద్దల నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, అనువంశిక పూజా రుల నేతృత్వంలో అమ్మవారిని గద్దె ఇంటి నుంచి ప్రభలతో, భాజాభజంత్రీలు, డప్పులు, వాయిద్యాలు, సన్నాయిమేళాలతో ఊరేగింపుగా సాగి అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర,రవికెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా చిరతలు, కోలాటాలు, కోబ్రా,నేల డ్యాన్స్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సిరిమాను చెట్టు ఊరేగింపునకు కసరత్తు

- 100 మందితో బందోబస్తు

విజయనగరం క్రైమ్:

ఈనెల 24 వ తేదీన శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టు ఊరేగింపునకు విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ లక్ష్మణరావు బందోబస్తు విషయమై ఆదివారం చర్చించారు. గంట్యాడ మండలం కొండతామరాపల్లిలో సిరిమాను చెట్టును ఆలయ అనువంశిక పూజారి గుర్తించారు. కొండతామరాపల్లి నుంచి సిరిమాను చెట్టును విజయనగరంలో ఆలయ పూజారి ఉంటున్న హుకుంపేటకు తీసుకువచ్చేందుకు రూట్ మ్యాప్, బందోబస్తుకోసం విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, గంట్యాడ ఎస్సై కృష్ణమూర్తి స్టేషన్‌లో చర్చించారు. దాదాపు వందమంది పోలీస్ సిబ్బంది అవసరమని గుర్తించారు. ఈ మేరకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు.


రూరల్ సీఐ లక్ష్మణరావు

రైతులను పట్టించుకోని పీఏసీఎస్

- సంతకవిటికి వచ్చిన 1344 యూరియా బస్తాలు
- అధికారికంగా చేపట్టని పంపిణీ
- గోప్యంగా కూటమి నాయకులకు చేరిన యూరియా
- సొసైటీ సీఈఓ నిర్వాకమని ఆరోపిస్తున్న రైతులు


కోరమాండల్ దుకాణం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు(ఫైల్)

సంతకవిటి: మండలంలో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మండల కేంద్రం సంతకవిటి ప్రాథమిక సహకార సంఘానికి ఇప్పటి వరకు రెండు పర్యాయాలు 1344 యూరియా బస్తాలు వచ్చాయి. వాటిని రైతులకు అందించడంలో సొసైటీ సీఈఓ విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియాను పీఏసీఎస్ గోడౌన్‌లో కాకుండా సచివాలయంలో దించడంలోనే పెద్ద మెలిక ఉందని రైతులు వాపోతున్నారు. ఆర్ఎస్‌కేలు, ప్రైవేట్ దుకాణాల్లో యూరియా కోసం రైతులు బారులు తీరుతున్న పరిస్థితి. సెప్టెంబర్ 12న మండల కేంద్రంలోని వినాయక ట్రేడర్స్ వద్ద యూరియ కోసం క్యూలో రైతులు నిల్చున్న సమయంలోనే కోరమాండల్ దుకాణానికి లారీతో యూరియా వెళ్తుంటే లారీ వెనుక కొంతమంది రైతులు పరుగెడుతూ కోరమాండల్ షాప్‌కు చేరుకున్నారు. ఈ ఒక్క ఉదాహరణ చాలు మండలంలో రైతులు యూరియా కోసం ఎంత యుద్ధం చేస్తున్నారో? అటువంటి పరిస్థితులు తెలిసికూడా నిబంధనలకు విరుద్ధంగా సొసైటీ ద్వారా యూరియా పంపిణీని కూటమి నాయకులే చేపట్టడం విశేషం. అదే రోజు సీఈఓ సెలవులో ఉండడం గమనార్హం.



సంతకవిటి పీఏసీఎస్

కనీసం అధికారికంగా అయినా పంపిణీ చేపట్టలేదు. దీనిపై సీఈఓ రమణను సాక్షి వివరణ కోరగా జూలైలో 900 బస్తాలు రావడంతో అప్పుడే పంపిణీ చేపట్టామని,

సెప్టెంబర్ 11 రాత్రి 444 బస్తాల యూరియా పీఏసీఎస్‌కు వచ్చిందని, పీఏసీఎస్ గోడౌన్ కారుతుండడంతో సచివాలయం గొడౌన్‌లో దింపామన్నారు. 12, 13 తేదీలలో సెలవులో ఉన్నాను. ఈ రెండు రోజుల్లో చైర్మన్ ఆదేశాలతోనే యూరియా పంపిణీని చేపట్టామని తెలిపారు. యూరియా పంపిణీ విషయంలో కనీసం మండల రైతులకు ముందస్తు సమాచారం లేదని, ఈ యూరియా మొత్తం కూటమి నాయకుల ఇళ్లకు చేరిందని రైతులు వాపోతున్నారు. 445 మంది రైతులకు యూరియా అందించామని సీఈఓ తెలిపారు. కనీసం ఒక రైతుకు ఒక యూరియ బస్తా ఇచ్చినా దాదాపు 1300 మంది రైతులకు లబ్ధి చేకురేదని రైతులు వాపోతున్నారు. కమీషన్‌కు కక్కుర్తి పడ్డ సీఈఓ యూరియా నేరుగా రైతులకు పంపిణీ చేయకుండా అడ్డగోలుగా వ్యవహరించారని రైతులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

కూటమి నాయకులే పంపిణీ చేస్తే అధికారులు ఎందుకు?



పీఏసీఎస్‌కు ఇప్పటివరకు 1344 యూరియా బస్తాలు వస్తే కనీసం రైతులకు సమాచారం ఇవ్వలేదు. అధికారులు అధికారికంగా పంపిణీ చేపట్టలేదు. కూటమి నాయకులు యూరియాను పంపిణీ చేశారు. దీనికి సీఈఓ సహకరించారు. మరి అటువంటప్పుడు పీఏసీఎస్‌లో అధికారులెందుకు? పీఏసీఎస్‌కు యూరియాను పంపడ మెందుకు? నాయకులకే పంపిస్తే బాగుండేది.

– సిరిపురపు జగన్‌మోహన్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్